# దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మేధావి పీవీ

## మాజీ ప్రధానికి సీఎం రేవంత్ శ్రద్ధాంజలి • 19వ వర్ధంతి సందర్భంగా పలువురి నివాళి

బేగంపేట్ డిసెంబర్ 23: భారతదేశ కీర్తిప్రతిష్ఠలను ప్రపంచానికి తెలియజెప్పిన గొప్ప మేధావి, బహుభాషా కోవిదుడు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగా శనివారం నెక్లెస్‌రోడ్‌లోని జ్ఞానభూమిలోని ఆయన సమాధి వద్ద సీఎం పుష్పాంజలి ఘటించారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు దయాకర్ గుప్తా, సురభి వాణీదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీ హనుమంతరావు తదితరులు పీవీ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు నాటి నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో క్రియాశీల పాత్ర పోషించారని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో సమూలమైన మార్పులు తీసుకువచ్చి పరిపాలన అంటే ఏ విధంగా ఉండాలో భవిష్యత్తు తరాలకు చాటి చెప్పిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ ఆర్థిక సంస్కరణలు చేపట్టి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. బంగారం కుదువ పెట్టి అప్పులు తేవడంపై పీవీ ఒక మాట చెప్పారని.. తెలివైన వాడు సగం ఆస్తిని కుదువ పెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటారని చెప్పారని గుర్తుచేశారు. పీవీ ఘాట్, జైపాల్‌రెడ్డి ఘాట్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. వీరిద్దరు తెలంగాణకు లంకెబిందెల్లాంటివారని, వారి కీర్తిని పెంచేలా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఐఏఎస్ అధికారులు దానకిశోర్, ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా పీవీ ఘాట్ ప్రాంగణంలో సర్వమత ప్రార్థనలు, భజనలు జరిగాయి.



నెక్లెస్‌రోడ్‌లోని పీవీ ఘాట్ జ్ఞానభూమిలో నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పీవీ తనయులు

### సామాజిక సంస్కరణలకు ఆద్యుడు: భట్టి

ప్రపంచంలో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావే పునాది వేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. న్యూఢిల్లీలోని తెలంగాణభవన్‌లో శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షోభంలో ఉన్న దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహానుభావుడు పీవీ అని కొనియాడారు. విద్యావ్యవస్థతో పాటు అనేక సామాజిక సంస్కరణలు తెచ్చిన మహానుభావుడని, పీవీ తెలంగాణలో పుట్టడం ఈ ప్రాంత బిడ్డగా తానెంతో గర్విస్తున్నానని తెలిపారు. అనేక భాషలపై పట్టు సాధించడంతోపాటు పాలనలో తనదైన శైలి, ప్రత్యేక ముద్రను చాటుకున్న పరిపాలన దక్షుడని కొనియాడారు. దేశ రక్షణ, ఆర్థిక, విదేశాంగ శాఖ మంత్రులుగా పనిచేసిన ఆయన ఎవరి ప్రభుత్వంలో ఉన్నా ఆ ప్రభుత్వానికి కావాల్సిన మార్గదర్శకాలు తయారు చేయడంలో దిట్టని చెప్పారు.



పీవీ వర్ధంతి సందర్భంగా శనివారం నెక్లెస్‌రోడ్డులోని పీవీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, శంభీపూర్ రాజు, బాల్క సుమన్ తదితరులు

# పీవీకి భారతరత్న ఇవ్వాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ • మాజీ ప్రధానికి ఘన నివాళి

జూబ్లీహిల్స్, డిసెంబర్ 23: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా సముచిత గౌరవం కల్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కే తారకరామారావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పీవీకి భారతరత్న ఇచ్చి గౌరవించుకోవాలని అన్నారు. పీవీ వర్ధంతి సందర్భంగా శనివారం నెక్లెస్‌రోడ్డులోని పీవీ సమాధి వద్ద పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పీవీ భారతదేశానికి ఆణిముత్యం వంటివాడని, తెలుగువారికి, తెలంగాణ రాష్ట్రానికి వన్నె తెచ్చిన నేత అని కొనియాడారు. అప్పుల్లో కూరుకుపోయిన భారతదేశాన్ని అలనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కలిసి గాడిలో పెట్టి దేశానికి ఎనలేని సేవలు చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పీవీకి చేసిన అన్యాయాన్ని సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల కూడా డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అత్యంత వైభవంగా పీవీ శతజయంతి ఉత్సవాలు భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ పెద్ద ఎత్తున నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని పీవీకి భారతరత్న ఇవ్వాలని ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# సిద్దిపేట-ఎల్కతుర్తి ఎన్‌హెచ్‌కు పీవీ పేరు

## రవాణా మంత్రి పొన్నం ప్రకటన • హనుమకొండ జిల్లా వంగరలో పీవీకి నివాళి

భీమదేవరపల్లి, డిసెంబర్ 23 : సిద్దిపేట-ఎల్కతుర్తి ఎన్‌హెచ్‌కు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జాతీయ రహదారిగా నామకరణం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం పీవీ స్వగ్రామం వంగరలో శనివారం పీవీ 19వ వర్ధంతిని నిర్వహించారు. జడ్పీచైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు అల్లిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, చాడ వెంకటరెడ్డితో కలిసి ఆయన పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సూచించారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో గ్రామీణాభివృద్ధిని పటిష్ఠం చేశారని గుర్తుచేశారు. నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మైనార్టీలో ఉన్న ప్రభుత్వాన్ని ఐదేండ్లపాటు కొనసాగించారని తెలిపారు. నవోదయ పాఠశాలలను ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పీవీ గౌరవాన్ని మరింత పెంచే విషయంలో తాను ముందుంటానని తెలిపారు.

### హుజూరాబాద్‌ను పీవీ జిల్లా చేయాలని నినాదాలు

హుజూరాబాద్‌ను పీవీ జిల్లా చేయాలని డిమాండ్ చేస్తూ వంగరలోని పీవీ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట పీవీ జిల్లా సాధన సమితి నాయకులు నినాదాలు చేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ నిరసనలో పీవీ జిల్లా సాధన సమితి కన్వీనర్ భీమోజు సదానందం, నాయకులు పొడిశెట్టి వెంకట్రాజం, రాచర్ల సారయ్య, పులి లత తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

## ఢిల్లీకి తిరిగివెళ్లిన ద్రౌపది ముర్ము

## వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం

హైదరాబాద్/మేడ్చల్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన శనివారం ముగిసింది. శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ముర్ము ఈ నెల 18న రాజధాని నగరం హైదరాబాద్ వచ్చిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారం రోజుల పర్యటన అనంతరం శనివారం ఉదయం భారత వాయుసేన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరిగి వెళ్లారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట్ విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, కలెక్టర్ గౌతమ్, త్రివిధ దళాల అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

### 27న ఉప రాష్ట్రపతి పర్యటన

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఈ నెల 27న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఉప రాష్ట్రపతి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి, జీఏడీ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్, వైద్యారోగ్యశాఖ కమిషనర్ క్రిస్టినా జడ్‌చోంగ్తూ, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలోని తన చాంబర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో మాజీ ఎంపీ మధుయాష్కీ తదితరులు

# సచివాలయంలో రాజకీయ సమావేశం

- మల్కాజిగిరి నియోజకవర్గ పార్టీ నేతలతో తుమ్మల మంతనాలు
- మాజీ ఎంపీ మధుయాష్కీ, నియోజకవర్గ కాంగ్రెస్ నేతల హాజరు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ పాలనా కేంద్రమైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో 'కాంగ్రెస్ పార్టీ' నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ కార్పొరేటర్లు, పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం ఏ విధంగా పనిచేయాలో చర్చించినట్టు స్వయంగా మధుయాష్కీ గౌడ్ వర్గీయులు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఇటీవలే రాజీనామా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా ఈ నియోజకవర్గంలో గెలవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉన్నది. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. ఈ సమావేశంపై రాజకీయ విశ్లేషకులు, ప్రతిపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు. మంత్రి తుమ్మల అధికారిక చాంబర్‌లో పార్టీ సమావేశాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 'ప్రభుత్వ పాలనా భవనాన్ని.. పార్టీ కార్యాలయంగా మార్చేస్తారా?' అని మండిపడుతున్నారు. 'అది సచివాలయం అనుకుంటున్నారా?.. గాంధీ భవన్ అనుకుంటున్నారా?' అని నిలదీస్తున్నారు. మంత్రి హోదాలో ఉండి పార్టీ కండువా వేసుకొని, పార్టీ సమావేశం నిర్వహిచడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం అయినంత మాత్రాన సచివాలయంలో సమావేశం నిర్వహిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రాజకీయ సమావేశంపై వెంటనే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# నేడు కలెక్టర్లతో సీఎం భేటీ

- ప్రజాపాలనపై అధికారులకు దిశానిర్దేశం
- ఆరు గ్యారెంటీల అమలు, ప్రజావాణి నిర్వహణ కార్యాచరణపై సూచనలు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారిగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశం కానున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు, పాలనా యాంత్రాంగాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లే ప్రజాపాలన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేయనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపులే ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్ర వారాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రజావాణిని జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించడానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల సమావేశంలో వెల్లడించనున్నారు. ఆర్థిక సాధికారిత కల్పించడం ద్వారా సామాజిక న్యాయం కల్పించేందుకు ప్రకటించిన ఆరు హామీల అమలుపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లను కూడా ఆహ్వానించారు. నిరుపేదలు, అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ ఫలాలు దక్కేలా పాలనా యంత్రాంగాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చడం, జవాబుదారీగా ఉండేందుకు ప్రజా పాలన చేపడుతున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 28వ తేదీ నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు సెలవు రోజులు మినహాయించి మొత్తం 8 పనిదినాలు ఈ ప్రజాపాలన కొనసాగనుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటలవరకు గ్రామ సభలు నిర్వహిస్తారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, అధికారులు పాల్గొననున్నారు.

# కొడంగల్ మళ్లీ పాలమూరులోకి!

## సీఎం ఆదేశాలతో మండలాల విభజనపై అధికారుల కసరత్తు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొడంగల్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో మహబూబ్‌నగర్ జిల్లాలో కలిపేందుకు సాధ్యాసాధ్యాలపై కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు అధికారులకు సీఎం రేవంత్ మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలోని కొన్ని మండలాలను నారాయణపేట జిల్లాలో, ఇంకొన్ని మండలాలను వికారాబాద్ జిల్లాలో కలిపారు. వీటిని ఈ రెండు జిల్లా పరిధి నుంచి మినహాయించి మహబూబ్‌నగర్ జిల్లాలోకి మార్చేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించినట్టు తెలుస్తున్నది. అంతేకాదు.. ఇతర జిల్లాల పరిధిలో ఉన్న మండలాలను ఒకే జిల్లా పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. 2016 అక్టోబర్ 12న చిన్న జిల్లాలు ఏర్పడగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించారు. ఈ జిల్లా పరిధిలోని షాద్‌నగర్ నియోజకవర్గాన్ని పూర్తిగా పాలమూరు జిల్లా నుంచి విడదీసి రంగారెడ్డి జిల్లాలో కలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కొన్ని మండలాలను నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోకి తీసుకొచ్చి మిగతా మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపారు. అంతేగాక కొన్ని నియోజకవర్గాల మండలాలను ఆయా జిల్లాల్లో కలపటంతో నియోజకవర్గ కేంద్రాలు ఒకవైపు, మండలాలు మరోవైపు అయ్యాయి. ప్రస్తుతం వీటిని సరిచేసే పనిలో పడ్డారు. సీఎం సొంత జిల్లా కావటంతో అధికారులు నియోజకవర్గ స్వరూపాన్ని జిల్లాల పరిధి నుంచి మార్చే దిశగా కసరత్తు చేస్తున్నారు.



శనివారం జనగామ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో బైఠాయించిన ఆటో డ్రైవర్లు

# ఆటో డ్రైవర్ల ఆందోళన

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ర్యాలీలు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో మా బతుకులు రోడ్డున పడ్డాయ్
- మా కుటుంబాలను ఆదుకోవాలని అధికారులకు వినతి పత్రాల అందజేత

జనగామ చౌరస్తా/మెదక్‌అర్బన్/దుబ్బాక టౌన్, డిసెంబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం జిల్లా కేంద్రాల్లో ఆటోలతో భారీ ర్యాలీలు నిర్వహించారు. జనగామ రైల్వేస్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ చేపట్టారు. మెదక్‌లోని వెల్‌కమ్ బోర్డు నుంచి ఆటోనగర్, పాతబస్టాండ్, రాం దాస్ చౌరస్తా, న్యూబస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తమకు ఉపాధి కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. చోట్ల ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆటో డ్రైవర్లు, ఓలా, ఊబర్ క్యాబ్ డ్రైవర్లు ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీలేని రుణం ఇప్పించాలని, పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని కోరారు. రూ.10 లక్షల ఉచిత ప్రమా ద బీమా సౌకర్యం కల్పించాలని, ఉచిత వాహన బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. 150 గజాల ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.ఐదు లక్షల వరకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

# ఏఐతో కొత్త ఉద్యోగాలు

## ప్రాంప్ట్ ఇంజినీరింగ్ నిపుణులకు డిమాండ్ • ఏఐపై పరిజ్ఞానం ఉంటే మరిన్ని అవకాశాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ).. ప్రస్తుతం ప్రపంచాన్ని తన గుప్పిట్లోకి తీసుకొంటున్న టెక్ ఆయుధం. చాట్‌జీపీటీతోనే దాని ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో అర్థమైపోయింది. ప్రస్తుతం గ్రామాల్లోనూ ఏఐ వినియోగం పెరిగిపోయింది. ఆరోగ్యం, విద్య, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్.. అనేక రంగాల్లో ఏఐ తిష్ట వేసుకొని కూర్చున్నది. దీనివల్ల రాబోయే కాలంలో పెద్దమొత్తంలో ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తం అవుతున్నది. అయితే, దానితో కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఐటీ నిపుణులు చెప్తున్నారు. ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌తో కొత్త ఉద్యోగాలు పుడతాయని అంటున్నారు.

### ప్రాంప్ట్ ఇంజినీర్లకు మంచి భవిష్యత్తు



ఏఐ వినియోగం రోజురోజుకు గణనీయంగా పెరుగుతుండటంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వారి ఉద్యోగాలు పోయే అవకాశం ఉన్నా, ప్రాంప్ట్ ఇంజినీర్లకు ఉద్యోగావకాశాలు చాలా ఎక్కువగానే ఉంటాయి. ప్రస్తుతం ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏదైనా సరే ఎక్కడో ఒక చోట ఏఐని తప్పనిసరిగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా చిన్న కంపెనీల నుంచి మొదలు కొని పెద్ద కంపెనీల వరకు ప్రాంప్ట్ ఇంజినీర్లను ఉద్యోగాల్లో చేర్చుకుంటాయి. ఏదైనా డిగ్రీ ఉండి, ఏఐపై పూర్తి స్థాయిలో పరిజ్ఞానం ఉండాలి. కంపెనీలు ఇంజినీరింగ్ నేపథ్యం ఉన్న విద్యార్థులకు ప్రాధాన్యమిచ్చే అవకాశాలు ఉన్నాయి.

– పద్మరాజు, ఐటీ నిపుణుడు


### ప్రాంప్ట్ ఇంజినీరింగ్ అంటే..

ఏఐ టెక్నాలజీతో కంప్యూటర్ యంత్రాలే మనుషుల్లా పనిచేసే స్థాయికి చేరుకున్నాయి. అయితే ఇక్కడ కంప్యూటర్ యంత్రాలు సరైన విధంగా స్పందించాలంటే, ఏదైనా ఒక ఇన్‌పుట్ ఇవ్వాలి. ఆ ఇన్‌పుట్.. యంత్రానికి సరిగా అర్థం కావాలి. మనం ఇచ్చిన ఇన్‌పుట్‌కు తిరిగి మనకు కావాల్సిన ఇన్‌పుట్‌ను కంప్యూటర్ ఇస్తే అదే ప్రాంప్ట్ ఇంజినీరింగ్. సింపుల్‌గా చెప్పాలంటే మనం ఒక విషయం గురించి అడిగితే కచ్చితంగా ఆ విషయానికి సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్ ఇచ్చిందంటే అది ప్రాంప్ట్ ఇంజినీర్ ఇచ్చిన ఇన్‌పుట్స్ వల్లేనని అర్థం చేసుకోవాలి.

### ప్రమాదమని తెలిసినా ఏఐని వాడేస్తున్నారు

ఏఐతో మానవాళికే ప్రమాదమని ఎంతో మంది నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా, ఏఐలో నిరంతరం పరిశోధనలు, కొత్తగా ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చాట్‌జీపీటీ అందుబాటులోకి రాగానే, గూగుల్ యుద్ధ ప్రాతిపదికన బార్డ్ ఉచిత వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత పెయిడ్ వెర్షన్‌లలో జెమినీ ఏఐ(అల్ట్రా, ప్రో, నానో)ని తీసుకొచ్చింది. మెటా సైతం ఏఐతో అప్లికేషన్‌ను ప్రకటించింది. ఇలా ప్రముఖ కంపెనీలు ఏఐ ప్రాజెక్టులను రూపొందిస్తూనే ఉన్నాయి. ప్రతి సంస్థ చాట్‌బోట్‌లను తమ వెబ్‌సైట్‌లలో ఏర్పాటు చేసుకుంటున్నాయి. మనుషుల స్థానంలో ఇప్పుడవే స్పందిస్తూ సమాధానాలు ఇస్తున్నాయి. ఇలా రోజురోజుకు ఏఐ వినియోగం గణనీయంగా పెరుగుతుండటంతో ప్రాంప్ట్ ఇంజినీర్ల అవసరం కంపెనీలకు ఉంటుంది. దీనిపై విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలు ఒకవైపు, నియామకాలు మరోవైపు జరుగుతూనే ఉన్నాయి.

## లోకం పోకడ




మీ కోసమేనయ్యా.. కాస్ట్లీ జెట్‌లో వెళ్తే కరువు నిధులు ఎక్కువొస్తాయనీ..

# కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

## అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలి: సీపీపీఎస్ఎస్

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత, ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని 'కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి' అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. కరెన్సీపై ఫొటో ముద్రించాలని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ, వీరన్ తదితరులు ఉన్నారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 8.5°c | 34.5°c |
| ఆదిలాబాద్ | 8.6°c | 34.2°c |
| మెదక్ | 11.2°c | 32.7°c |
| హైదరాబాద్ | 14.7°c | 27.9°c |
| నల్లగొండ | 15.0°c | 31.1°c |
| కరీంనగర్ | 16.0°c | 29.0°c |
| మహబూబ్‌నగర్ | 16.5°c | 30.6°c |
| నిజామాబాద్ | 16.7°c | 36.6 °c |
| వరంగల్ | 17.0°c | 28.0°c |
| ఖమ్మం | 18.0°c | 30.0°c |

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### ఎయిమ్స్‌లో..

నాగపూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 31
- పోస్టులు: సీనియర్ రెసిడెంట్
- విభాగాలు: కార్డియాలజీ, పాథాలజీ, ఆప్తాల్మాలజీ, యూరాలజీ, కమ్యూనిటీ మెడిసిన్
- దరఖాస్తు, చివరితేదీ తదితర వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
- వెబ్‌సైట్: https://aiimsnagpur.edu.in

### ఐఐఎస్‌టీలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో, సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో, జేఆర్ఎఫ్
- దరఖాస్తు, చివరితేదీ తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- వెబ్‌సైట్: https://www.iist.ac.in

### ఏఏఐలో...

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సదరన్ రీజియన్‌లోని వివిధ ఎయిర్‌పోర్టుల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 119
- పోస్టులు: జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్
- విభాగాలు: ఫైర్ సర్వీస్, ఆఫీస్, ఎలక్ట్రానిక్స్, అకౌంట్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 26
- వెబ్‌సైట్: https://www.aai.aero

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- కరెంట్ అఫైర్స్, మ్యాథ్స్ (గ్రూప్స్, డీఎస్సీ), ఫిజిక్స్ (ఐఐటీ-నీట్ ఫౌండేషన్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.